# శాలిని

గౌరీశంకర్ కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

తన కూతురు శాలిని ఆత్మహత్య చేసుకుంది.

కాదు.... తనే హత్య చేశానని ఇప్పుడిప్పుడే తెల్సుకుంటున్నాడు.

ఛ! తనెందుకు శాలినిని చంపుతాడు... శాలిని తమవల్ల ఇంటి తీరే మారిపోయింది.

ఉద్యోగం చేసిన ఏడాదిలో ఇంటి స్టేటస్సే మారిపోయింది.

పాతికేళ్లుగా గౌరీశంకర్ ఉద్యోగం చేస్తూ సంపాదించిన జీతం కన్నా నాలుగు రెట్లు ఎక్కువ సంపాదించింది.

తాము డబుల్ బెడ్రూమ్ సొంత ఫ్లాట్‌లోకి మకాం మారచ్చని - తమ ఇంటికో సొంత కారు వస్తుందని... అతను కల కనడానికి కూడా

'ఖరీదు'గా భావించే సోఫాసెట్లు, కలర్, టీవీ విసీడీ వగైరాలు అన్నీ మాయాజాలం చేసినట్లు తమ ఇంట్లోకి వచ్చి చేరతాయని గౌరీశంకర్ అస్సలూహించలేదు.

కాల్ సెంటర్‌లో - నిత్యం నైట్ డ్యూటితో పిల్ల ఎంతగా నలిగి పోతుందో అతను భావించలేదు. చేరిన మొదట్లోనే ఇంటికి కారు వచ్చేది.

సాయంత్రం 6 కాగానే ఇంటిముందు ఇంద్రరథంలా కారాగుతూ అమ్మాయిని ఎక్కించుకుని తీసుకెళ్లటాన్ని టీఆర్టీ క్వార్టర్స్‌లో అందరూ ఈర్ష్యగా చూసేవారు.

"ఆడపిల్లని రాత్రిపూట ఉద్యోగానికి పంపించడమేంట"ని ఈర్ష్య పడేవాళ్లు. కాత్యాయినిని మొహంమీదే అడిగేసేవారు. వెర్రిది కాత్యాయినికీ జవాబు దొరకక భర్త దగ్గర విలవిలలాడేది. "వాళ్ల మొహం! వాళ్ల మాటలు పట్టించుకోకు" అని నీతోపదేశం చేస్తూ వచ్చాడు. రాన్రాను కాత్యాయినికి కూడా శాలినీ తెచ్చే జీతం, తనకి కొనిపెట్టే ఖరీదైన చీరలు రుచిగా అనిపించాయి. శాలిని మొదట్లో "అబ్బ ఈ ఉద్యోగం చేయలేను" అని విసుగ్గా అన్నప్పుడు - "నువ్ హాయిగా మూడుగంటల వరకూ పడుకో. నీకే డిస్ట్రబెన్సూ లేకుండా నేను చూస్తాను" అని పడుకోబెట్టి తను చుట్టుపక్కల వాళ్ళింటికెళ్లి గొప్పలు చెప్తూ కాలక్షేపం చేసేది - ఆ చుట్టుపక్కల వాళ్లు కూడా విస్మయంగా వినేవాళ్లు.

"అమ్మాయి పడుకుంది - ఇంట్లో ఉంటే నేనేదో సర్దుళ్లూ చప్పుళ్ళూ చేస్తాను- మార్నింగ్ షోకెళ్లొస్తాను" అని వాళ్లని కూడా తీసుకెళ్లి నోరు మూయించేది. అలా శాలిని జీతం ఆ వీధి ఆడాళ్లకి పరోక్షంగా ఎంజాయ్ మెంట్ అయింది. డబ్బు చెట్టులా పెరిగిపోతున్న కూతుర్ని చూసి గౌరీశంకర్, కాత్యాయినీ గర్వంగా ఉన్నారు. ఇంతలో పిడుగు పడింది. శాలిని

ఆత్మహత్య చేసుకుంది. కాదు బతికున్న తల్లీదండ్రులను, వాళ్ల వైభవాన్ని హత్య చేసింది. సుదీర్ఘమైన ఉత్తరం రాసిపెట్టి... నిద్రమాత్రల్తో వెళ్లిపోయింది. కాత్యాయిని కుప్పకూలి పోయింది. భార్యకి స్పృహ వస్తుందో రాదో కూడా ఆలోచించే స్థితి కాదు అతనిది. కూతురు రాసిపెట్టిన ఉత్తరం చదువుతున్నాడు.

శాలిని ఆత్మవ్యథ:

నాన్నకీ అమ్మకీ - సారీ! నా జీవితానికి... జీతానికి అనాలేమో... ఫుల్‌స్టాప్ పెట్టేస్తున్నాను -

కాల్ సెంటర్లో ఉద్యోగంలో చేరిన కొన్ని రోజులకే నాకు అక్కడ ఇమడటం కష్టం అనిపించింది. కానీ మీకు చాలా ఆనందంగా అనిపించింది. నేనెన్నిసార్లు చెప్పినా 'అంత మంచి ఉద్యోగం... అంత మంచి జీతం...' అని నన్ను నోరెత్తనీయకుండా చేశారు. అసలు నేను పడే ఇబ్బందేంటి అనేది మీరెప్పుడూ వినటానికి కూడా వప్పుకునేవారు కాదు. రాత్రిపూట కూతుర్ని బైటికి పంపిస్తున్నందుకు ఎవరైనా ఏమన్నా అన్నా... మీకు పట్టదు - పంపించకూడదని మీకు తట్టదు.

నేను మిగిలిన అందరమ్మాయిల్లా అందులో ఇమడలేకపోయాను. వాళ్లలా తప్పించుకునే తెలివితేటలూ లేవు. కొందర్లా తప్పుకాదిది అని భావించే తెగింపూ నాకు లేదు. మేము ఉండేది ఇండియాలోనే కానీ తీసుకునేది విదేశీ కూలి. ఇక్కడ రూపాయలల్తో పోలిస్తే ఎక్కువే కావచ్చు... కానీ వాళ్లకిది ఒక క్లర్క్‌కీ, కాపలా కుక్కకీ పెట్టే ఖర్చే- ఇచ్చే జీతం డబ్బులే కాకుండా మాకు కూడా వీకెండ్ పార్టీలూ సండే సెలబ్రేషన్లూ పెట్టి... కొత్త కొత్త మత్తులు అలవాటు చేసారు.

మనింట్లో ఓ విదేశీ వనితని తయారుచేసి పడేశారు.

రాత్రి డ్యూటీలో చాలామంది విదేశస్తులుగా మారిపోతుంటారు. వీకెండ్‌లో పూర్తిగా విదేశస్తులైపోతారు. రోజూ తెల్లారగానే నేను అలిసిపోయి ఇంటికొచ్చి నిద్దరపోతున్నానంటారు గానీ... తాగి పడుకుంటానని మీకు తెలియదా- ఎందుకు తాగటం అని ఎన్నిసార్లో అనుకుంటాను. కానీ అది తెలియని మాయ! తెలివి రాకూడదని వాళ్లు అంటించిన మాయ. ఆ ఉద్యోగం మానేయాలని, ఆ మైకానికి అలవాటు పడకూడదని మొదట్లోనే నాలుగు రోజులు డ్యూటీ ఎగ్గొట్టాను గుర్తుంది కదా! ఇంట్లో మీ సతాయింపుకన్నా వంట్లో మైకంకోసం పడే ఆరాటం ఎక్కువైపోయింది. కొన్నాళ్ళు నిగ్రహించుకుందామనుకున్నా, ఆఫీసు పిలుపులు ఎక్కువైపోయాయి- మళ్లీ డ్యూటీ- మళ్లీ అన్నీ మొదలు... ఈ వలయంలోంచి బైటికి రాలేననిపించింది.

వీకెండ్‌లు, డేటింగ్‌లూ కూడా బాగున్నాయనిపించింది. ఆఫీసులో... 'ఇది తప్పుకాద'ని రెచ్చకొట్టే మగాళ్లూ ఆడాళ్లూ కూడా ఎక్కువమందే తయారయ్యారు. నేనూ తప్పన్నవాళ్ళని రెచ్చకొట్టేస్థాయికి (ఎ)దిగిపోయాను.

మామూలు మధ్యతరగతి ఆడపిల్లలా... 'మనం పెళ్లి చేసుకుందామా' అని అడిగాను బాయ్‌ఫ్రెండ్‌ని- అతను గొల్లున నవ్వేసి... ఎబార్షన్ చేయించాడు. మళ్ళీ అతనితోనే సరసాలూ సరాగాలూ... నాకు రాన్రానూ ఆత్మ చచ్చిపోతోంది. మిమ్మల్ని కూడా కసురుకోవటం కోపగించుకోవటం ఎక్కువైంది. మీ మీద ప్రేమ ఎప్పుడో పోయింది. ఆ విషయం మీకు తెల్సినా నన్నేమీ అనలేదు. మీకొక్కటే భయం. నేను ఎవర్నైనా పెళ్లి చేసుకుని వెళ్లిపోతానేమోనని నాకు సంబంధాలు చూస్తున్నట్లు ఈ మధ్య నటన మొదలెట్టారు. నాకు పెళ్లేంటి? నా మొగుడు నన్ను ఈ ఉద్యోగం చెయ్యనిస్తాడా? మీరు మాననిస్తారా? రెండూ జరగవు. కొన్నాళ్లు నేను పెళ్లాంగా నటించినా మళ్లీ నా నరాలు కాల్‌సెంటర్‌కి లాగవూ... మీరే

మాత్రం ఆలస్యం చెయ్యకుండా నా ప్రాణం ఉండగానే ఇల్లు చక్కబెట్టు కోవాలనుకున్నట్లు కారూ, ఫ్లాట్ సమకూర్చుకున్నారు– దాని కోసం లోను పెట్టించి, అది తీరేదాకా 'ఈ ఉద్యోగం మానద్దమ్మా' అని ప్రేమగా శాసించేసారు.

నాకేం వింతగా లేదు– విచారంగానూ లేదు– ఇప్పుడు దొంగేదుపులు వద్దు.

నిజం నిష్టూరంగా ఉంటుంది.

సంపాదించే నటీమణులపై తల్లిదండ్రులు ఎంతమంది కుట్రలు చేస్తున్నారో తెలియదా? మీకు ఆ పాపం రాకుండా నేనే తొందర పడుతున్నాను. ఈ ఉత్తరాన్ని గ్యాస్టవ్ వెలిగించి కాల్చేయండి– నా దిండుకింద ఇంకో కాయితం ఉంది చూడండి– అది ప్రపంచానికి చూపించండి! 'జీవితం మీద విరక్తితో నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. దీనికెవ్వరూ బాధ్యులు కారు' అని రాశాను. వచ్చే జన్మంటూ ఉంటే మీ ఇంట్లో పుట్టను. గుడ్‌బై!!.

నిజానికిది ముక్తాయింపు కాదు. ఒక సంఘటన.

కాల్ సెంటర్లోనే కాదు – కాపురం చేసుకుంటున్న భర్త ఇంట్లో కూడా ఇమడలేని వారు ఇదేరీతిలో ఆత్మహత్య 'చేయబడవచ్చు'

'ఆత్మన్యూనతా భావం' అనీ 'పిరికితనం' అనీ పేర్లుపెట్టి మానసిక విశ్లేషణా వ్యాసాలూ ఆత్మస్థైర్య కౌన్సిలింగులూ ఎన్నైనా జరుగుతూండవచ్చు. విశ్లేషకులు డబ్బులూ సంపాదించవచ్చు.

కానీ...., శాలినిలా... ఎవరూ 'తయారు'కాబడకూడదు– హఠాత్తుగా అంతస్తులకోసం పైకెగరాలని ప్రయత్నం చేయద్దు– అని గౌరీ శంకర్... కాత్యాయినీ వెక్కెక్కి ఏడ్చి చెప్పారు. కూతురు వేసిన శిక్ష అనుభవిస్తున్నారు.

